# విశ్వ సందేశము

*(ప్రియతమ బాబా **10 జూలై, 1958** నాడు మెహెరాబాదులో ఈ సందేశమిచ్చారు మరియు దీనిని విశ్వమంతా వ్యాపింపజేయమని తన ప్రేమికులకు చెప్పారు. సుమారు 200 మంది ప్రేమికులు ఆ సమావేశములో పాల్గొన్నారు.)*

నేను బోధించుటకు రాలేదు – మేల్కొల్పుటకు వచ్చాను. అందువలన నేనెట్టి నియమములను విధించుట లేదు.

అనాది నుండి నే ననేక నీతులను, నియమాలను (ధర్మాలను) విధించియున్నాను. కాని మానవాళి వాటిని పాటించలేదు. భగవంతుడు చెప్పినది మానవు డాచరించక పోవడం వలన అవతారుని బోధలు అపహాస్యమునకు గురియగుచున్నవి. అవతారుడు బోధించిన కరుణను ఆచరణలో పెట్టుటకు మారుగా అతని పేరుతో మానవుడు మారణకాండను సాగించాడు. వినమ్రత, పవిత్రత, సత్యము జీవితమందు ఆచరించుటకు బదులుగా మానవుడు ద్వేషము, దురాశ, హింసలకు లోనగుచున్నాడు.

గతంలో భగవంతుడేర్పరచిన నీతి, ధర్మములను మానవుడు పెడచెవిన పెట్టుటచే ఈ అవతారంలో నేను మౌనం వహించియున్నాను. మీరు అడగటం, అవసరమైన మాటలు చెప్పడం జరిగింది. ఇప్పుడా మాటలను జీవితాలలో ఆచరించవలసిన సమయ మాసన్నమైనది. భగవంతునికి సన్నిహితంగా చేరుటకు 'నేను', 'నా యొక్క', 'నాది' అనువాటికి దూరముగా పోవలసి ఉన్నది. నీవు దేనినీ త్యజించ వలసిన అవసరము లేదు. నీ స్వార్థాన్ని మాత్రము వదిలితే చాలు. అది ఎంత కఠినంగా కనిపిస్తుందో అంత సులభమైనది గూడా. పరిమితమైన నీ అహంకారమును త్యజించుట నా యనుగ్రహముతో సాధ్యపడుతుంది. ఆ అనుగ్రహమును ప్రసరింపజేయుటకే నేను వచ్చియున్నాను.

నేను నియమములను విధించుట లేదని మళ్ళీ చెప్పుచున్నాను. నేను విడుదల చేయదలచిన సత్య ప్రవాహమును వదిలినప్పుడు మానవ జీవితాలు ధర్మబద్ధములై ఉంటాయి. నా మాటలు వారి జీవితాలలో జీవం పోసుకొని ప్రతిఫలిస్తాయి. మానవున కాతని అజ్ఞానమనే తెర వల్లనే నేను మరుగున పడియుంటాను.

నా వైభవాన్ని కొందరికి మాత్రమే వ్యక్తం చేస్తాను. **ఈనాటి నా అవతార రూపం ఈ యుగ విభాగంలోని ఆఖరి అవతారం. అందుకే నా ప్రకటీకరణ గత అవతారాలలో కన్నా ఘనంగా ఉంటుంది.** నేను నా మౌనం విరమించినప్పుడు దాని ప్రభావం విశ్వవ్యాప్తంగా ఉంటుంది. సృష్టిలో జీవకోటి యంతా దానిని గుర్తించి, అనుభవించి స్వీకరిస్తుంది. ప్రతివ్యక్తీ తాననుసరించే మార్గాన బంధనాల నుండి స్వేచ్ఛను పొందుటకు అది సహకరిస్తుంది. ఎప్పుడూ నిన్ను నీవు ప్రేమించుకునే దానికన్నా మిన్నగా ప్రేమించే దివ్య ప్రియతముడను నేనే. నీ నిజ స్వరూపాన్ని తెలుసుకోవడానికి నీ ప్రయత్నంలో నా మౌన విరమణ నీకు సహాయపడుతుంది.

ప్రపంచంలో నెలకొన్న ఈ గందరగోళము, కల్లోల పరిస్థితులు అనివార్యమైనవే. దాని కెవ్వరినీ నిందింప పనిలేదు. జరుగవలసినది జరిగింది; జరుగబోయేది జరిగి తీరుతుంది. నేను మీ మధ్యకు రావడం కన్నా వేరే గత్యంతరం లేకపోయింది. నేను రావలసియున్నది, వచ్చియున్నాను. నేను పురాణ పురుషుడను.

— **అవతార్ మెహెర్ బాబా**